విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 21, డిసెంబర్ 2024

భూ సమస్యలపై సిపిఐ, సిపిఎం నాయకులు అర్జీల సమర్పణ

విశాలాంధ్ర-పామిడి : భూ సమస్యలు పరిష్కరించేందుకు శుక్రవారం పామిడి తాహసిల్దార్ కార్యాలయంలో తాహసిల్దార్ శ్రీధర్ మూర్తి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సిపిఐ, సిపిఎం ఎమ్మార్పీఎస్ నాయకులు, వామపక్ష నాయకులు తాహసిల్దార్‌కు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పామిడి పొలం 463, 466, 467,203,303, 311,318,329,463, సర్వే నంబర్లలో లక్షలు పలుకుతున్న స్థలాన్ని రికార్డు ప్రకారం సర్వేయరుతో కొలతలువేసి హద్దులు కనపర్చాలన్నారు. అలాగే ప్రభుత్వ మిగులు స్థలాన్ని కూడా కబ్జాలో ఉన్నాయని, వాటిని తక్షణమే స్వాధీనం చేసుకుని ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించుకోవాలని కోరారు. లేనిపక్షంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలు నిరవధిక నిరహార దీక్షలు ఆందోళనలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నాయకులు రహీం, అనిమిరెడ్డి, ఎంసి సుంకన్న, వంక రాజు కాలవ వెంకటేష్, సిపిఐ నాగరాజు, మల్లేష్,, చౌడప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, ముత్యాలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి

విశాలాంధ్ర-కుందుర్పి : మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో లక్ష్మి శంకర్, ఏపీఓ రవీంద్ర సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమా వేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడుతూ గ్రామాలలో రాజకీయ కక్షలు ప్రేరేపించ కుండా ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని కోరారు.

వడ్డేపాల్యం యువకుడు కర్ణాటకలో అనుమానాస్పద స్థితిలో మృతి

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్: కుందుర్పి మండలం వడ్డే పాల్యం గ్రామానికి చెందిన గిత్త రాజు(32) అనుమానాస్పద స్థితిలో కర్ణాటకలో మృతి చెందిన ఘటన గురువారం రాత్రి వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు .. రాజు తాపీ మేస్త్రిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గురువారం కర్ణాటక ప్రాంతమైన నాగేపల్లి గేటుకు ఉదయం ఉదయం మిత్రులతో కలిసి వెళ్లాడు. అదే రాజు రాత్రి నాగేపల్లి గేటు బస్సు షెల్టర్ వెనుక భాగాన మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కర్ణాటక పరశురాంపురం పట్టణ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహంపై గాయాలు ఉండడంతో పోలీసుల దర్యాప్తులో నిజా నిజాలు తెలియాల్సి ఉంది. మృతునికి భార్య ఈశ్వరమ్మ ఆరు నెలల చిన్నారి ఉంది.

ప్రభుత్వ ఆసుపత్రిల్లోనే సురక్షిత ప్రసవం

విశాలాంధ్ర-శెట్టూరు : ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణీలకు ప్రసవం సురక్షితమని డాక్టర్ తరుణ్ సాయి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గర్భవతు లకు క్లినిక్ డే సందర్భంగాగర్భవతులకు వివిధ రకాల రక్త పరీక్షలు చేపట్టారు. ప్రతిరోజు సమతుల ఆహారం తీసుకుంటేనే కడుపులో బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని, గర్భవతులకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే సురక్షితమైన ప్రసవం జరుగుతుంది తెలిపారు. ప్రైవేట్ హాస్పిటల్లో గర్భవతులకు భయభ్రాంతులకు గురిచేసి సాధారణ ప్రసవాన్ని కూడా సిజేరియన్ చేయాలని వేలకు వేలు డబ్బులు గుంజుతున్నారు అని తెలియజేశారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి ...

విశాలాంధ్ర-బుక్కరాయసముద్రం: గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులటు సద్వినియోగం చేసుకోవాలని బుక్కరాయసముద్రం మండల వ్యవసాయ అధికారి శ్యాంసుందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్దతు ధర రూ.2320తో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులు వరిలో 17 శాతం మాత్రమే తేమ ఉండే విధంగా ఆరబెట్టుకోవాలని వివరించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

విశాలాంధ్ర-బ్రహ్మసముద్రం : మండలంలోని తీటకల్లులో శుక్రవారం విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అనంతమ్మ(58) కుళాయికి సంబంధించిన మోటర్ ప్లగ్ పెడుతుండగా విద్యుత్ షాక్ గురై కింద పడిపోయారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఉడేగోళంలో రెవెన్యూ సదస్సు

విశాలాంధ్ర-రాయదుర్గం టౌన్ : మండలంలోని 74-ఉడేగోళం గ్రామంలో శుక్రవారం తహసిల్దార్ నాగరాజు ఆధ్వర్యంలో రెవిన్యూ సదస్సు కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ పట్టదారుల సబ్- డివిజన్ కొరకు-10, విస్తీర్ణం తేడా-3,పేరు నవరణ-1 మొత్తం-14 దరఖాస్తులు వచ్చాయని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఐదేళ్ల సమస్య పరిష్కరించిన ఎమ్మార్వో

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్ : మండల పరిధిలోని ఓబులాపురం, మానిరేవు గ్రామాల నడుమ ఐదు సంవత్సరాలుగా వివాదం నడుస్తున్నది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ భాస్కర్ ఒక్కరోజులో పరిష్కరించారు. తిమ్మరాజులకి ఎర్రిస్వామికి చర్చి స్థలం విషయమై వివాదం ఉంది. ఈ విషయమై ఇరుపక్షాలు గ్రామస్తుల ఆధ్వర్యంలో తహసీల్దార్ సమస్యను పరిష్కరించినందుకు, ఆ రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

వివాహానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: మండలంలో ఎస్‌కెబి ట్రావెల్స్ మాలిక ఉమేష్ గౌడ కుమారుడు సందీప్ గౌడ వివాహానికి రాయ దుర్గం మాజీ ఎంఎల్ఏ కాపు రామచంద్రారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యమంలో బళ్లారి రూరల్ ఎమ్మెల్యే భరత్ రెడ్డి. వన్నూర్‌స్వామి, రాళ్ళ తిమ్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మల్లికార్జున, మరిస్వామి తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బకాయిలు సాధించే వరకు పోరాటం ఆగదు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసేందుకు అవసరమైతే ప్రత్యేకంగా చట్టాన్ని తీసుకొస్తమని చెప్పిన గత ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టి ఆరు మాసాలు గడిచినా అగ్రిగోల్డ్ బకాయిల చెల్లించక పోవడం సిగ్గు చేటని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో అగ్రిగోల్డ్ ఏజెంట్ల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుకు తాను ప్రతిపక్ష హెూదాలో అగ్రిగోల్డ్ బాధితులు నిరసనకు సంపూర్ణ మద్దతు ఇచ్చిన విషయం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. అధికారం కోసం అడ్డుగోల హామీలు మంచిది కాదన్నారు. ఎన్డీయే కూటమి మ్యాన్ ఫెస్టోలో పొందుపర్చిన అగ్రిగోల్డ్ బాధితుల హామి గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. పదేళ్లుగా అగ్రిగోల్డ్ బాధితులకు రావాల్సిన బకాయిల సాధించేందుకు రాష్ట్ర వ్యాప్త ఉద్యమంతో కొన్ని సాధించామని సాధించాల్సినవి ఉన్నాయి కనుక 26 జిల్లాల్లో ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ కాలంలో అసెంబ్లీ ముట్టడి దాకా ఉద్యమం వెళ్లడం కారణంగా అప్పటి సిఎం జగన్ రూ.9 వందల కోట్ల బకాయిలను బాధితులకు అందజేశారన్నారు. సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి రావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యము సరికాదన్నారు. అందరూ కలిసి వస్తే సమస్యలు సాదించుకోవడం కష్టమేమీ కాదన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు మద్దతుగా సిపిఐ జిల్లా కార్యదర్శి సి. జాఫర్, సహాయ కార్యదర్శి పి. నారాయణస్వామి మాట్లాడారు. ఈ సమావేశంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అషోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కుళ్లాయప్ప, ఎర్రిస్వామి, కార్యదర్శి ధనుంజయ్య, అల్లిపీర షబ్బర్, నాగేంద్ర,భాగ్యలక్ష్మి,పద్మ పాల్గొన్నారు.

శకుంతలమ్మ మరణం కార్మిక, మహిళా రంగానికి తీరనిలోటు

-సంస్మరణ సభలో నేతలు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: శకుంతలమ్మ మరణం మహిళా సమాఖ్య, కార్మిక ఉద్యమానికి తీరని లోటని వక్తలు పేర్కొన్నారు. ఏఐటియుసి మాజీ జిల్లా అధ్యక్షులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య మాజీ జిల్లా అధ్యక్షురాలుగా వివిధ బాధ్యతల్లో పనిచేసిన కామ్రేడ్ శకుంతలమ్మ 19 నవంబర్ 2024వ తేదీన అనారోగ్యంతో మరణించగా ఆమె సంస్మరణ సభ శుక్రవారం అనంతపురం ఎన్జీవో హెూమ్‌లో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మావతిల అధ్యక్షతన జరిగింది. ముందుగా నాయకులు శకుంతలమ్మ చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వర రావు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్‌లు పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతర ముఖ్య అతిథులుగా వారు మాట్లాడుతూ 40 ఏళ్లుగా పీడిత ప్రజల కోసం సీపీఐ పార్టీలో వివిధ బాధ్యతలు తీసుకొని నిర్విరామంగా అలుపెరుగని పోరాటం చేసిన నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకురాలు శకుంతలమ్మ అని కొనియాడారు. ఎగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించినా నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, కార్మికులకు కనీస వేతనాలు, పని భద్రత కల్పించాలని జరిగిన ఉద్యమాల్లో అగ్ర భాగాన నిలిచారన్నారు. ఆమె భర్త బ్యాంకు ఉద్యోగుల ప్రముఖ నాయకులు బుషేంద్ర బాబు అడుగుజాడల్లో పార్టీ సిద్ధాంతంలో భాగమైన గతి తార్కిక భౌతిక వాదాన్ని దృఢంగా విశ్వసించిన నాస్తికురాలు శకుంతలమ్మ అన్నారు. కేసులకు, జైల్లకు భయపడకుండా ఉద్యమాలు నిర్వహించారన్నారు. సిపిఐ అనంతపురం, సత్యసాయి జిల్లాల కార్యదర్శులు జాఫర్, వేమయ్యలు మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం, మహిళ లపై అకృత్యాలు, అరాచలకు వ్యతిరేకంగా, మహిళా చట్టాల అమలుకోసం సమున్నత పోరా టాలు శకుంతలమ్మ నిర్మించారన్నారు. మరణించిన తర్వాత తన శరీరాన్ని వైద్య విద్యార్థుల పరిశోధన కోసం దానం చేసిన స్ఫూర్తి ప్రదాత శకుంతలమ్మ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, వ్య.కా.సం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, సిపిఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, గుంతకల్ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, అనంతపురం నగర సహాయ కార్యదర్శి రమణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, ఈఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్ళాయ్ స్వామి, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, నగర అధ్యక్షులు చిరంజీవి, ఈఐఎస్ఎఫ్ మహిళా సమాఖ్య మాజీ నాయకులు కమరబేగం, వైసిపి నాయకులు కెవి రమణ, గిరిజన సమాఖ్య నాయకులు వైయల్ రామాంజినేయులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చెన్నప్ప, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు పార్వతి ప్రసాద్, ఇన్సాఫ్ జిల్లా నాయకులు అల్లీపీరా, గొర్ల పెంపకదార్ల సంఘం నాయకులు పోతులయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమంతు, చేనేత సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవేణి, మెడికల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

అమీత్‌షాపై రాజద్రోహం కేసు నమోదు చేయాలి

విశాలాంధ్ర-అనంతపురం రూరల్: శ్రీకృష్ణదేవరాయల యూనివర్సిటీ ప్రధాన గేటు ముందర ఏఐఎస్ఎఫ్, ఎస్ఎస్ యూఐ విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ శ్రీకృష్ణదేవ రాల యూనివర్సిటీ కార్యదర్శి రమణయ్య మాట్లాడుతూ బిజెపి అధికారంలో ఉందని పార్లమెంటులో అమిత్ షా రాజ్యాంగం లిఖించిన అంబేద్కర్ పేరు ఉచ్చరిస్తూ పదేపదే కించపరిచి మాట్లాడడం దేశ గౌరవాన్ని దిగజార్చడమే అన్నారు. మతాలకు అతీతంగా దేశ రాజ్యాంగాన్ని లిఖించిన అంబేద్కర్‌ని కించపంచిన అమిత్ షా భారత జాతికి క్షమాపణ చెప్పే వరకు దళిత, బడుగు, బలహీన వర్గాలు నిరసనలు చేపట్టాలని అదేవిధంగా దేశంలో నున్న విశ్వవిద్యాలయాల్లోకి అమిత్ షా రాకుండా విద్యార్థులు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. హెూం మంత్రి అమిత్ పార్లమెంటులో మాట్లాడిన వాటిని పార్లమెంటు రికార్డు నుంచి తొలగించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ శ్రీ కృష్ణ దేవరాయ యూనివర్సిటీ నాయకులు సాయిమహేష్, సుబ్బ రాయుడు, శీనునాయక్, జగదీష్, అంబేద్కర్,అనిల్ నాయక్, ఎన్ఎస్‌యుఐ నాయకులు ఇనుముల ప్రసాదు, సునీల్, సంజయ్తు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల ప్రమోషన్లు చేపట్టాలి

విశాలాంధ్ర-అనంతపురం రూరల్ : ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆగిన మున్సిపల్ నగరపాలక ఉపాధ్యాయుల ప్రమోషన్ జాబితాను విడుదల చేసి ప్రమోషన్లు నిర్వహించాలని డీఈవో ప్రసాద్ బాబుకు ఎస్టియు సంఘం నాయకులు వినతిపత్రం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి రామాంజనేయులు శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్, నగర పాలక సంస్థ పాఠశాలల్లో వివిధ ఖాళీలను ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలని ఆదేశించిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ రకాల కారణాలతో ప్రమోషన్లు ఆగి ఉన్నాయని తెలిపారు. మున్సిపల్, నగరపాలక సంస్థలోని అన్ని ఖాళీలను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని డిమాండు చేశారు. పాఠశాలల్లో ఖాళీలు ఉన్న ప్రమోషన్లలో రోస్టర్ పాయింట్ లేదనడం సమంజకాదన్నారు. 70:30 ప్రకారం కచ్చితంగా రోస్టర్ పాయింట్లు లెక్కించి ఉన్న ఖాళీలను భర్తీ చేసి ఉపాధ్యాయ మరియు విద్యార్థులకు న్యాయం చేయాలని వారు కోరారు. గతంలో కూడా ప్రమోషన్లు ఇచ్చే క్రమంలో ఉపాధ్యాయులకు తక్కువగా ప్రమోషన్లు ఇచ్చారని గుర్తు చేశారు.వీటిని సరి చేయాలి. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ సబ్జెక్టుల సీనియారిటీ జాబితాలను ప్రకటించాలని కోరారు.. వాటిని కూడా ఈ ప్రమోషన్ల ద్వారానే భర్తీ చేసి రోస్టర్ రిజిస్టర్ జిరాక్స్ కాపీని ఉపాధ్యాయ సంఘాలకు అంద చేయాల్సిన బాధ్యత అధికారులేదేనన్నారు. టెంటేటివ్ సీనియార్టీ జాబితా లో తప్పులు సవరించమని ఉపాధ్యాయులు ఇదివరకే ఆఫీసులో వారి యొక్క అబ్జెక్షన్‌లను తెలియజేసి ఉన్నారు. వాటిని సరి చేయాలన్నారు. డీఎస్సీ 2018 2020, 2021లో ప్రమోషన్ తీసుకున్న ఉపాధ్యాయులను సీనియార్టీ జాబితాలో చేర్చాలని ఉర్దూ ఉపాధ్యాయులలో డీఎస్సీ 2020 వారికి కూడా కొన్ని సందర్భాలలో ప్రమోషన్లు వచ్చే ఏర్పాటు ఉంది కనుక సీనియార్టీ జాబితాలో వారి పేర్లను పొందుపరచాలి. ఈ కార్యక్రమంతో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ హాణి భూషణ్ , సీనియర్ నాయకులు అజయ్ కుమార్, నగర నాయకులు మల్లికార్జున, గంగాధర్, శ్రీనివాసరెడ్డి, ఇంద దుల్ల, కరీముల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సీఎంఆర్ఎఫ్ నిధులు : ఎమ్మెల్యే సునీత

విశాలాంధ్ర-రాప్తాడు: గత ప్రభుత్వంలో సీఎం సహాయ నిధి ద్వారా సాయం అందించాలన్నా రాజకీయాలు చూశారని, ప్రస్తుతం సీఎం చంద్రబాబు రాజకీయాలకతీతంగా సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. నియోజకవర్గానికి చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. నియోజకవర్గానికి చెందిన పలువురు వివిధ అనారోగ్య కారణాలతో వైద్యంకోసం వెళ్లిన సమయంలో ఆరోగ్య శ్రీ వర్తించకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొందిన వారు ఆర్థిక సాయం చేయాలని దరఖాస్తులు చేసుకున్నారన్నారు. అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో 9మందికి రూ.19.42 లక్షల విలువగల చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం విషయంలో కూడా గతంలో రాజకీయాలు చూశారని, ఆలాంటివి జరగకుండా సీఎం చంద్రబాబు పేదల ఆరోగ్య విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నారన్నారు. అందుకే సీఎంఆర్ఎఫ్ విషయంలో అడిగిన వెంటనే ఎంతైనా చేస్తున్నారన్నారు.మండల కన్వీనర్ పంపు కొండప్ప, సర్పంచ్ సాకే తిరుపాలు ఉన్నారు.

కూడేరులో భూముల పరిశీలన

విశాలాంధ్ర-కూడేరు : మండల కేంద్రంలోని 535 సర్వే నెంబర్‌లోని భూములను శుక్రవారం జిల్లా సర్వేయర్, భూమి రికార్డుల అధికారి పరిశీలించారు. ఏపీఐసీసీ భూములను, అహుడ వెంచర్లను, సర్వేనెంబర్లో ఆక్రమణకు గురైన భూము లను, అందులో సాగుచేసిన పంటలను పరిశీలించారు. అనంతపురం బళ్లారి జాతీయ రహదారి నుంచి ఏపీ ఐసీసీ భూములలోకి రహదారికి సంబంధించిన సర్వే నంబర్లను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ రూప్ల నాయక్, అనంతపురం డిఐఓ ఎస్,గుప్తా, కూడేరు ఇంచార్జ్ తహసిల్దార్ మహబూబ్ బాషా పాల్గొన్నారు..

గార్లదిన్నె పోలీస్ స్టేషన్లో వార్షిక తనిఖీ

విశాలాంధ్ర-గార్లదిన్నె: వార్షిక తనిఖీలో భాగంగా గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ జగదీశ్ శుక్రవారం సందర్శించారు. స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధులు, కేసుల దర్యాప్తు, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను పరిశీలించారు. రిసెప్షన్ కౌంటరు, లాకప్ గదులను కంప్యూటర్ గదిని తనిఖీ చేశారు.

కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను తక్షణమే మంత్రివర్గం నుంచి తొలగించాలి

అంబేద్కర్లిస్టులు నిరసన ర్యాలీ..

విశాలాంధ్ర-గుత్తి : మూడు రోజుల క్రితం పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పైన అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమీత్ షాను మంత్రి పదవి నుండి తక్షణమే తొలగించాలని కోరుతూ శుక్రవారం పట్టణంలో గాంధీ విగ్రహం కూడలి నుండి అంబేద్కర్ విగ్రహం కూడలి వరకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి రామదాసు, బీఎస్పి జిల్లా అధ్యక్షుడు గద్దల నాగభూషణం మాట్లాడుతూ అంబేద్కర్ ద్వారా రాజ్యాంగం ఏర్పడిందని ఇది గుర్తించుకోవాలని, వెంటనే క్షమాపణలు చెప్పాలని లేకుంటే ముున్ముందు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా నాయకులు గద్దల నాగభూషణం, సిపిఐ మండల కార్యదర్శి రామదాసు, వాల్మీకి నాయకులు బాచి, కుల వివక్షత వ్యతిరేక పోరాట సమితి నాయకులు మల్లికార్జున, బండల రామాంజనేయులు,బీఎస్పీ నాయకులు విజయ్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి నరసింహయ్య, పట్టణ కార్యదర్శి రాజు యాదవ్ ,సహాయ కార్యదర్శి నజీర్, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకులు అడవి రాముడు, మాల సంఘం నాయకులు బేల్దారి చంద్ర పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు తగవు..

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో అంబేద్కర్ విగ్రహం ముందు శుక్రవారం ధర్నా నిర్వహించి బిజెపి ప్రభుత్వానికి కేంద్ర హెూంమంత్రి అమీషాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అమిత్ షా అణుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని, ఆయన మాటలు దళితుల ఆత్మగౌరవాన్ని అవమానపరిచినట్లు ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వానికి నరేంద్ర మోడీకి దళితులు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లో ఉన్నాయన్నారు. అమీషా అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి బే షరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గురు, నాగరాజు, వన్నూరు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

పేదల సమస్యలపై పోరాడిన మహనీయుడు సత్ గాడ్గే బాబా

ఏపీ రజక వృత్తిదారుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.లింగమయ్య నివాళులు

విశాలాంధ్ర-అనంతపురం: చాకలి ఐలమ్మ కాలనీలో స్వచ్ఛ భారత్ కోసం పరితపించిన సత్ గాడ్గే బాబా శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఏపీ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.లింగమయ్య మాట్లాడుతూ... గాడ్గే బాబా మహారాష్ట్రలో జన్మించారన్నారు. పేదల సమస్యల పట్ల పోరాడే వ్యక్తి అని కొనియాడారు. అప్పట్లోనే శ్రమదానం చేసి పరిశుభ్రత కోసం తపించాడని భారత్ రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ గాడ్గే బాబాని అభినందించడం జరిగిందన్నారు. అలాంటి మహనీయులని కేంద్ర ప్రభుత్వం వర్ధంతి జయంతి నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి సివి హరికృష్ణ జిల్లా ఉపాధ్యక్షుడు సి నాగప్ప,ఐలమ్మ కాలనీ సిపిఐ కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శిలు సంజీవులు, లక్ష్మీనారాయణ, చేతి వృత్తి దారుల సమాఖ్య గౌరవాధ్యక్షులు ఈశ్వరమ్మ చేతి వృత్తిదారుల సమాఖ్య నగర కార్యదర్శి వీరాంజి లక్ష్మీదేవి, వీర నారాయణప్ప పాల్గొన్నారు.

పత్రికా ప్రపంచంలో విశాలాంధ్రకు ప్రత్యేక గుర్తింపు

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర-రాప్తాడు: పత్రికా ప్రపంచంలో విశాలాంధ్ర దినపత్రికకు పాఠకుల మదిలో ప్రత్యేక గుర్తింపు ఉందని అనంత పురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. విశాలాంధ్ర 2025 నూతన క్యాలెండరును ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పుట్టినరోజు సందర్భంగా రాప్తాడు విశాలాంధ్ర రిపోర్టర్ కమ్మూరు శీనా ఆధ్వర్యంలో ఆవిష్కరింపజేశారు. ఎంపీ మాట్లాడుతూ విశాలాంధ్ర పత్రిక బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం అక్షర రూపంలో 72ఏళ్లుగా వార్తలను సమాజానికి అంది స్తోందన్నారు. నేటి కాలానికనుగుణంగా సమకాలీన వార్తలను పాఠకులకు చేరవేయాలని సూచించారు.

క్యాలెండరు ఆవిష్కరించిన సీఐ

విశాలాంధ్ర-పామిడి: ప్రజాసమస్యలను నిర్భయంగా ప్రచురిస్తూ ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా నిలుస్తున్న విశాలాంధ్ర దినపత్రిక ప్రజలతో మమేకమైందని పామిడి సర్కిల్ ఇన్స్పెక్టర్ యుగంధర్ తెలిపారు. శుక్రవారం స్థానిక పామిడి పోలీస్ స్టేషన్ లో 2025 సంవత్సరం నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సుంకన్న, టిడిపి నాయకుడు రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కందుల వ్యాపారులపై కేసు నమోదు

విశాలాంధ్ర-ఉరవకొండ: వజ్రకరూరు మండలం చాబాల గ్రామంలో కొంతమంది వ్యాపారులు కందులు కొనుగోలు చేసి తూకాలలో రైతులను మోసం చేశారు. గమనించిన రైతులు వజ్రకరూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేసి దళారులు, వ్యాపారులు పైన కేసులు నమోదు చేశారు. ఈ సంఘటనపై వజ్రకరూరు ఎస్సై నాగ స్వామి శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ చాబాల గ్రామంలో గురువారం రైతుల నుంచి కందులు కొనుగోలు చేయడానికి వెళ్లిన వ్యాపారులు ఎలక్ట్రానిక్ కాటా యంత్రం ద్వారా 50 కేజీల కందులకు గాను 62 కేజీలు తూకం వచ్చేలా మోసం చేశారని.. తూనికలు కొలుతుల అధికారి ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ కాటా యంత్రాన్ని పరిశీలించగా అందులో రిమోట్ కంట్రోల్‌తో నడిచే చిప్‌ను అమర్చినట్లు బయటపడిందన్నారు. మోసానికి పాల్పడిన కేసు నమోదు చేశామని చెప్పారు.

రాయదుర్గంలో 'టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం' కార్యక్రమం

విశాలాంధ్ర-రాయదుర్గం టౌన్ : పట్టణంలోని టౌన్ ప్లానింగ్ సంబంధించిన సమస్యలపై మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి శుక్రవారం కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు, బిల్డింగ్ ఇన్స్పెక్టర్, లైసెన్స్ ఇంజనీర్లు వారి సహకారంతో ప్రజల సందేహాలను సమస్యలను కొన్ని పరిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ సంబంధిత సమస్యలు ప్రతి శుక్రవారం ఉన్నతాధికారి ఆదేశాల మేరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున పట్టణ ప్రజలు ప్రతి శుక్రవారం సమస్యలపై తమను సంప్రదిస్తే న్యాయం చేస్తామని తెలిపారు.

నేడు ఉచిత కంటి చికిత్స శిబిరం

విశాలాంధ్ర-కణేకల్లు : కణేకల్ గ్రామంలోని పూలచెర్ల గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టినరోజు వేడుకల్లో సందర్భంగా శనివారం రోజున ఉచిత కంటి పరీక్ష కేంద్రం శిబిరం నిర్వహిస్తున్నట్లు వైయస్ పార్టీ నాయకులు తెలిపారు.బళ్లారి ఎల్వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ వారి నుండి కంటి వైద్య నిపుణులు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం వరకు చికిత్సలు నిర్వహిస్తారన్నారు. ముఖ్యఅతిథిగా వైసీపీ రాయదుర్గం మెట్టు గోవిందరెడ్డి ముఖ్యఅతిథిగా రానున్నట్లు తెలిపారు.

ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర-కూడేరు : మండలపరిధిలోని కరుట్లపల్లి గ్రామంలో శుక్రవారం స్థానిక వాల్మీకుల ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హెూమాలు చేశారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు జ్యోతులను మోసుకుని ఊరేగింపుగా వెళ్లి వాల్మీకి మహర్షికి సమర్పించారు. ఈ మహెూత్సవానికి వివిధ గ్రామాల నుంచి వాల్మీకులు పెద్దఎత్తున తరలి వచ్చారు. సాయంత్రం గ్రామంలో వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని ఊరేగించారు

ఎమ్మెల్యే జెసి.అస్మిత్ రెడ్డి చొరవతోనే సిసి రోడ్లు ఏర్పాటు

విశాలాంధ్ర-తాడిపత్రి: ఎమ్మెల్యే జెసి.అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జెసి. ప్రభాకర్ రెడ్డి జోక్యంతోనే చుక్కలూరు గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం జరుగుతోందని టీడీపీ చుక్కలూరు గ్రామ ఇంచార్జ్ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుండి వర్షం వచ్చిందంటే కాలనీలలో వర్షం, మురుగు నీరు పోక ప్రజలు ఆ నీటిలోని నడుచుకుంటూ ఇంటిలోనికి వెళ్లి, ఇంటి నుండి బయటికి వెళ్లాలన్న తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారు. ఎన్నికల సమయంలో జెసి.అస్మిత్‌రెడ్డి, జెసి.ప్రభాకర్ రెడ్డిలు చుక్కలూరు గ్రామంలో పర్యటించిన సమయంలో గ్రామస్తులు తమ గ్రామంలో కొన్ని కాలనీలలో సిసి రోడ్లు, మురికి కాల్వలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారికి విన్నవించుకున్నారు. దీంతో జెసి. అస్మిత్ రెడ్డి ఎమ్మెల్యే చొరవతో చుక్కలూరు గ్రామంలో సిసి రోడ్లు ఏర్పాటుకు దాదాపు రూ.30 లక్షలతో రోడ్లు నిర్మాణం చేస్తున్నా మన్నారు. దీంతో గ్రామ ప్రజలు ఎమ్మెల్యే జెసి. అస్మిత్ రెడ్డికి మున్సిపల్ చైర్మన్ జెసి. ప్రభాకర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు.

పెండింగులో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులు విడుదల చేయాలి

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పుట్టపర్తిలో నిరసన ....

విశాలాంధ్ర-పుట్టపర్తి : రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ వసతి దీవెన డబ్బులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శేషం మహేంద్ర,శేఖరరెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని గణేష్ కూడలిలో నిరసన వ్యక్తం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువగలం పాదయాత్రలో నారా లోకేష్ఇచ్చిన హామీ జీవో నెంబర్ 77 రద్దు చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ 2100 కోట్లు వసతి దీవెన రూ.1480కోట్లు పెండింగ్ లో ఉన్నాయని, తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రతి సంవత్సరం విద్యార్థులకు సంబంధించి నాలుగు క్వార్టర్ల రూపంలో డబ్బులు జమ అయ్యేటివి, గత సంవత్సరం విద్యార్థులకు క్వార్టర్ మాత్రమే విడుదల చేశారన్నారు. రాష్ట్రంలో దాదాపు 9.5 లక్షల మంది విద్యార్థులు డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ విద్యను అభ్యసిస్తున్నారని, దానిలో క్వాటర్ ఫీజులు 708 కోట్లు విడుదల చేశారని,మూడు క్వాటర్లకు సంబంధించి దాదాపు 2100 కోట్లు విడుదల చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రియంబర్స్మెంట్ వసతి దీవెన డబ్బులు విడుదల కాక విద్యార్థులకు కోర్సులు అయిపోయినప్పటికీ సర్టిఫికెట్లు ఇవ్వ కుండా కళాశాల యాజమాన్యాలు ఇబ్బంది పెడుతు న్నాయన్నారు. పెండింగ్లో ఉన్న డబ్బులు చెల్లిస్తేనే మీకు పరీక్షలకు అనుమతి ఇస్తామని అంటున్నారన్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక సర్టిఫికెట్లు తీసుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నారా లోకేష్ మా ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందని హామీ ఇచ్చినప్పటికీ ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యులు విద్యాశాఖ మంత్రి మాటను గాలికి వదిలేసి విద్యార్థులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని మండిపడ్డారు. పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ అరుణ్‌రెడ్డి, నరసింహమూర్తి, సాయిగౌతమ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు రవి, చరణ్, గోపి, విశ్వనాథ్, అనిల్, శ్యామ్ సుందర్, అశోక్, నాగ పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులుగా జమ్మానిపల్లి మూర్తి ఎన్నిక

విశాలాంధ్ర-మడకశిర : వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులుగా మడకశిర మండలం జమ్మనిపల్లి గ్రామానికి చెందిన నరసింహమూర్తిని నియమించినట్లు పార్టీ ఆఫీస్ నుండి శుక్రవారం ప్రకటన విడుదలైంది.వైయస్సార్సీపి పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ కోసం అహర్నిశలు కష్టపడుతున్న మూర్తి ఎంపిక పట్ల పలువురు వైకాపా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నరసింహమూర్తి మాట్లాడుతూ ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి నా వంతు కృషి చేస్తానన్నారు.

ఘనంగా ముగిసిన పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2024

▸ పోలీసుల నిత్య జీవితంలో క్రీడలు కూడా ఎంతో ముఖ్యం : ఎస్పీ రత్న

విశాలాంధ్ర-పుట్టపర్తి: పోలీసుల నిత్యజీవితంలో క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని ఎస్పీ రత్న పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తిలోని ఫరేడ్ మైదానంలో మూడు రోజుల నుంచి జరిగిన పోలీస్ వార్షిక క్రీడా పోటీలు శుక్రవారంతో ముగియడంతో బహుమతుల ప్రధాన కార్యక్రమా నికి ఎస్పీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతిరోజు పోలీసులు ప్రాణాలు కూడా పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కూడా మానసికంగా, శారీరకంగా ఎంతో ఉల్లాసాన్ని కల్గిస్తాయని అభిప్రాయపడ్డారు. గెలుపోటములు సమానంగా తీసుకోవాలని తెలియ జేశారు. హోదాలు మరచి అందరూ ఒక టీంగా ఏర్పడి కష్టించాల్సి ఉంటుందన్నారు. చిన్న పెద్ద అనే బేధాలు లేకుండా సిబ్బంది మధ్య ఒక స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. .పోలీసుశాఖలో ప్రతీ ఒక్కరూ క్రమశిక్షణ, దేహదారుఢ్యం కల్గి ఉండటం చాలా ముఖ్యన్నారు. ఇదే మాదిరిగానే నిత్యం మనం చేసే విధుల్లో నిబద్ధత కనబరిస్తే ప్రజలకు మెరుగైనసేవలు అందించవచ్చు అని సూచించారు. ఇదే ఉత్సాహంతో 2025లో మరింత ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ క్రీడా పోటీలను మూడు రోజులపాటు సమర్థవంతంగా విజయవంతం చేసినందుకు అన్ని విభాగాల పోలీస్ అధికారులకు సిబ్బందికి మీడియా ప్రతినిధులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. స్పోర్ట్స్ అండ్ గేమ్ మీ పోటీలలో విజేతలుగా నిలి చిన వారు మెడల్స్, సర్టిఫికెట్లు, షీల్డ్స్ ఎస్పీ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏవో సుజాత, సూపరిండెంట్ సరస్వతి, ఏఆర్‌డి ఎస్పి శ్రీనివాసులు, డీఎస్పీ లు విజయ్ కుమార్, శ్రీనివాసులు వెంకటేశ్వర్లు కేవీ మహేష్ ఎస్బి సిఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు వెంకటేష్, రామకృష్ణ, సూర్యనారాయణ, సుధాకర్ నాగరాజు, ఉషారాణి, స్వర్ణ, సుహాసిని, ఎస్‌బిఎస్ ఐ ప్రదీప్ కుమార్, ఆర్ఐలు, వలి, మహేష్, రవి కుమార్, ఆర్ఎస్ఐలు వీరన్న, వెంకటేశ్వర్లు, ప్రదీప్ సింగ్, ప్రసాద్, ఏ ఆర్ఎఎస్ఐ శ్రీరాములు హోంగార్డ్ ఇన్చార్జ్ రామాంజనే యులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పనిముట్లు పంపిణీ చేసిన మున్సిపల్ కమిషనర్

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని నాలుగు డివిజన్లలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు అందరికీ పనిముట్లను మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ చేతులమీదుగా మాస్టర్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మొత్తం నాలుగు డివిజన్లో పని చేసే పారిశుద్ధ్య కార్మికులకు పనిముట్లు గతంలో లేకపోవడంతో ఎన్నో ఇక్కట్లను ఎదుర్కొనే వారని, నేడు పనిముట్లు పంపిణీ చేయడం వల్ల మరింత పరిశుభ్రత ఏర్పడుతుందని తెలిపారు. మొత్తం 164 మందికి పనిముట్లు పంపిణీ చేశామని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై పరిష్కారానికి తాను కృషి చేస్తానని, వారు పని విధానంలో మెరుగు ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ శాంసన్, కేశవ, మేస్త్రీలు ఆంజనేయులు, పార్థ, నరసింహులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల పేరిట రూ.80 లక్షల స్వాహా...

▸ ఓవర్సీస్ బ్యాంకు మేనేజర్ జ్యోష్ణ

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలో కొంతమంది నకిలీ (బోగస్) మహిళా సంఘాలను నిర్వహిస్తూ, ఓవర్సీస్ బ్యాంకులో రూ.80 లక్షలకు పైగా రుణాలను తీసుకొని మోసం చేసిన వైనం వెలుగులోకి వచ్చింది. బ్యాంకు మేనేజర్ జోష్నా వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో టౌన్ మిషన్ కోఆర్డినేటర్ బండి వెంకటేష్, రిసోర్స్ పర్సన్స్ శోభారాణి, కొండమ్మ పై ఫిర్యాదు చేశారు. నిందితులపై వారిపై వెంటనే కేసు నమోదు చేసి న్యాయం చేయాలని కోరారు. అనంతరం వన్టౌన్ సిఐ నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ నకిలీ మహిళా సంఘాలను సృష్టించి రుణాలు ఇప్పించిన వ్యక్తులపై త్వరితగతిన విచారణ చేపట్టి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

దాత డోల రాజారెడ్డికి ఘన సన్మానం

విశాలాంధ్ర-ధర్మవరం: స్థానిక పుట్టపర్తి రోడ్ సాయి నగర్ లో గల శిరిడి సాయిబాబా దేవాలయంలో గత కొన్ని రోజులుగా మాలధారణ వేసిన 500 మంది భక్తులకు భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగానే అన్నదాత సుఖీభవ.. అని డోలా రాజారెడ్డికి మాలదారులు ఆశీస్సులు అందజేస్తున్నారు. వందలాది మందికి అన్నదానం చేయడం భగవంతుని సేవతో సమానమని దాతను మాలదారులు కొనియాడారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా శివుని అనుగ్రహంతో విజయవంతం కావడం ఎంతో సంతోషకర మని తెలిపారు. శుక్రవారం షిరిడి సాయిబాబా సిబ్బందికి దాత చేతులమీదుగా ఘన సన్మానం చేశారు. దాత డోలా రాజారెడ్డి దంపతులను బాబా ఆలయ కమిటీ వారు, యోగా గురువు నారాయణరెడ్డి, వారి శిష్యులతో కలిపి ఘనంగా సన్మానించారు. ఈ అన్నదాన కార్యక్రమం ఈనెల 21వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, యోగ గురువు, శిష్యులు పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి..

విశాలాంధ్ర-ధర్మవరం : గర్భిణీ స్త్రీలు ఆరోగ్యమును కాపాడుకోవాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు చిన్న తంబి చిన్నప్ప తెలిపారు. శుక్రవారం పట్టణంలోని శివానగర్లో గల అర్బన్ హెల్త్ సెంటర్లో గర్భిణీ స్త్రీలకు బండ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి జూటూరు సత్యనారాయణ విరాళం ఇచ్చారన్నారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గౌతమి మాట్లాడుతూ గర్భిణీలు ప్రతినెల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు తోపాటు తగిన టీకాలు కూడా వేయించుకోవాలని తెలిపారు. కుటుంబ సభ్యులు కూడా గర్భిణీలకు సహాయ సహకారాలను అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జగ్గా వేణుగోపాల్, చైర్మన్ నారాయణమూర్తి, కార్యదర్శి మంజునాథ్, కోశాధికారి చంద్రశేఖర్ సభ్యులు రామకృష్ణ, జగ్గా నాగరాజు, జింక చిన్నప్ప, ఏఎన్ఎం పుష్పలత, నారాయణమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన డీఐఓ

విశాలాంధ్ర-లేపాక్షి : లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డిఐఓ) నాగేంద్రనాయక్ శుక్రవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్, ఫార్మసీ, ప్రసవ గదులను పరిశీలించారు. అక్కడున్న రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ గురించి వివరాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారి డాక్టర్ వెంకటచిరంజీవి. ఎంపి హెచ్ఐఓ సుబ్రమణ్యం, సిహెచ్‌లు ఉన్నారు.

ఘనంగా క్రిస్మస్ పండగ క్యారల్స్

విశాలాంధ్ర-అమరాపురం: స్థానిక షాలోమ్ క్రిస్టియన్ ప్రార్థన మందిరం నిర్వాహకులు (పాస్టర్) ఏ టి ఎస్ ప్రకాష్ రావు ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా క్రిస్మస్ పండగ క్యారల్స్ నిర్వహించారు. బెంగళూరు నుండి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పాస్టర్ మధు సూదన్ యోహోవా దేవుని వద్దకు వచ్చిన వారందరికీ పరిశుద్ధులవుతారని తెలియజేశారు. జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులలకు స్వీట్లు పంచుకొంటూ సెలబ్రేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో గ్లోరీ, పిఎస్ ప్రశాంత్, హనుమంతరావు, హ్యారి పాల్గొన్నారు.

3 టిప్పర్లు జప్తు చేసిన కియా పోలీసులు

విశాలాంధ్ర-పెనుకొండ: కియా ఇండస్ట్రియల్ పోలీసులు వాహనాలకు అనుమతులు లేకుండా తిరుగుతున్న 3 టిప్పర్లను జప్తు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనుమతి పత్రాలు గురించి తెలియజేయాలని రవాణా శాఖ అధికారులకు లేఖ రాశారు. అధికారులు వచ్చి వాటిని పరిశీలించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని ఎస్సైరాజేష్ తెలిపారు.

పాతపద్ధతుల్లోనే వైద్య సౌకర్యాలు అందించాలి

ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దామోదర్ రావు

విశాలాంధ్ర-పుట్టపర్తి : ఏపియస్ ఆర్టీసీ (పీటీడీ) ఉద్యోగులకు పాత పద్ధతుల్లోనే వైద్య సేవలు అందించాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదర్ రావు పేర్కొన్నారు. శుక్రవారం గణేష్ కూడలిలోని షాదీ మహల్‌లో జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి ఆధ్వర్యం లో జిల్లాకు చెందిన ఆరు డిపోల ఎంప్లాయీస్ యూనియన్ ఉద్యోగులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ అభద్రతతో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసి ఉద్యోగుల ఉద్యోగ భద్రత కోసం ఎంప్లాయీస్ యూనియన్ గుర్తింపు కాలంలో 2019లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలోనే సాధించుకున్నామన్నారు. గత నెల 29 న విజయవాడలో ఆర్టీసిహౌస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మిన్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉన్నతాధికారుల సమావేశంలో సర్క్యులర్ ను యధాతదంగా అమలు చేస్తామని హామీ ఇచ్చినా అమలు చేయడంలో ఏ డిపోలలో నైనా ఇబ్బందులు సృష్టిస్తే వెంటనే రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. పిటిడి (ఆర్టీసి) ఉద్యోగులు ఉద్దేశపూర్వకంగా ఏ తప్పు చేయ కుండా విధులు నిర్వహించాలన్నారు. తనిఖీ అధికారులు తప్పుడు కేసులు వ్రాస్తే అక్కడి నాయకత్వం ఉద్యమాలు చేయడానికి వెనుకాడ వద్దన్నారు. గత 12 ఏళ్లుగా ఆర్టీసీలో కారుణ్య నియామకాలు తప్ప ఏ ఒక్క ఉద్యోగి నియామకం కూడా ఏ కేడర్‌లోనూ జరగనందున ఆర్టీసిలో సుమారు 10 వేలు పోస్టుల వరకు ఖాళీలు ఉన్నా యన్నారు. ఈ సమావేశంలో ఇ.యు స్టేట్ మెంటినెన్సు కమిటీ మెంబర్ ఇర్షాద్, జోనల్ నాయకులు యన్.సి.శేఖర్, హెచ్.అరుణమ్మ, నబి రసూల్, రీజినల్ ప్రెసిడెంట్ కేబీఎస్‌రెడ్డి, రీజనల్ కార్యదర్శి జివైపిరావు, జిల్లా నాయకులు యన్.నారాయణ స్వామి, ఆర్.యస్.రెడ్డి, ఏ.వి.వి.ప్రసాద్, పి.రమణప్ప, విజయలక్ష్మి, సాధక్, జి.ఆర్.బాబు, నరసింహులు, సుమో శ్రీను, 6 డిపోల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

నాణ్యమైన వస్తులను మాత్రమే కొనుగోలు చేయాలి..ఆర్డీఓ మహేష్

విశాలాంధ్ర-ధర్మవరం: నాణ్యమైన వస్తువులను మాత్రమే వినియోగదారులు కొనుగోలు చేయాలని ఆర్డీవో మహేష్ తెలిపారు. శుక్రవారం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, వినియోగదారుల సంఘం, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్, ప్రిన్సిపాల్, విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డిఓ మాట్లాడుతూ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. తదుపరి ఆర్డిఓ ఆధ్వర్యంలో విద్యార్థులచే, అధ్యాపకులచే, ఉపాధ్యాయులచే వినియోగదారుల ప్రతిజ్ఞను చేయించారు. వినియోగదారుల చట్టం హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని,తగిన న్యాయం పొందాలని తెలిపారు. అక్రమ వ్యాపార విధానాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. మోసపూరిత ప్రకటనలు ప్రభావితం కారాదని, కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు రసీదు పొందాలని, ఎమ్మార్పీ ధర కన్నా అధిక బిల్లు చెల్లించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి లక్ష్మీదేవి, ధర్మవరం తాసిల్దార్ సురేష్ బాబు, వినియోగదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోలా ప్రభాకర్ ,ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, అధ్యాపకులు శ్రీనివాస్ రెడ్డి, మల్లికార్జున, కరుణాసాగర్, రాజేశ్వర రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కుల్లయిరెడ్డి,ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ శైలజ, ఉపాధ్యాయులు వేణుగోపాలాచార్యులు, నౌరా, పట్టణ వినియోగదారుల సంఘం అధ్యక్షులు కుల్లాయప్ప కోశాధికారి రవీంద్ర గౌరవ అధ్యక్షులు గోవిందు సభ్యులు సుభాన్, నారాయణమ్మ, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

23న ప్రత్యేక బడ్జెట్ సమావేశం

మున్సిపల్ చైర్మన్ కే.లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో ఈనెల 23వ తేదీ మధ్యాహ్నం 12:30 గంటలకు కౌన్సిల్ హాల్‌లో పురపాలక సంఘ బడ్జెట్ ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ కే.లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ సమావేశంలో బడ్జెట్‌పై చర్చిస్తామని, అనంతరం పట్టణ సమస్యలపై తీసుకోవలసిన చర్యలను చర్చిస్తామన్నారు. 2025-26 సంవత్సరమునకు తయారు చేయబడిన బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ ఆమోదం కోసం ఉంచబడుతుందని తెలిపారు. కావున మున్సిపల్ కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు అన్ని విభాగ అధిపతులు సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని కోరారు.

పారిశుధ్య కార్మికులుగా కొనసాగించండి..

విశాలాంధ్ర-రొళ్ల:- మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు కాంట్రాక్టు పద్దతిలో పారిశుధ్య కార్మికులుగా 10 సంవత్సరాల నుండి నుండి పని చేస్తున్నాము. మమ్ములను ఉన్న ఫలంగా తొలగించి మా కుటుంబాలను రోడ్డు పాలు చేశారని, తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని మా ఉద్యోగానికి రక్షణ కల్పించాలని కోరుతూ శుక్రవారం బాధితులు జిల్లా కార్మిక శాఖ అధికారికు వినతిపత్రం ఇచ్చారు. వీరికి మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి సాకే వెంకటేష్ మాట్లాడుతూ రాజకీయ కక్ష వివక్షతో పారిశుధ్య కార్మికుల పొట్టకొట్టడం సిగ్గుచేటన్నారు. అధికారులు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఎదురోనలో తాగు నీటి సమస్య తీర్చండి

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మండల పరిధిలోని ఎదురుదోన గ్రామంలో తహసీల్దార్ దేవేంద్ర నాయక్ అధ్యక్షతన శుక్రవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కదిరి ఆర్డీవో వివిఎస్ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదని, రైతులు తమ భూ సమస్యలను అర్జీ రూపంలో తెలపాలని కోరారు. గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నదని, పంచాయతీ అధికారుల ద్వారా సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరారు. పాము కాటుకు,కుక్క కాటుకు మందులు ఆరోగ్య ఉప కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని విన్నవించారు. రైతుల నుండి 22 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ దేవేంద్ర నాయక్ తెలిపారు.సర్పంచ్ నాగ మునీశ్వర నాయుడు,మండల సర్వేయర్ జిలాని, ఆర్ఐశ్రీధర్, ఫారెస్ట్ అధికారులు రామచంద్ర నాయక్, సర్వేయర్లు పాల్గొన్నారు.

వైసీపీ ఐటి వింగ్ ప్రెసిడెంట్‌గా గంగిరెడ్డి ఎంపిక

విశాలాంధ్ర-నల్లమాడ : మండలంలోని గోపేపల్లి గ్రామానికి చెందిన దాదిరెడ్డి గంగిరెడ్డి సాఫ్టువేర్ జిల్లా వైసీపీ ఐటీ వింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపిక అయ్యారు. నన్ను ఎంపీక చేసినో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, జిల్లా వైసీపీ ఇన్‌చార్జి ఉషశ్రీచరన్, పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి కట్టుబడుతూ అహర్నిశలు కష్టపడి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలను జయప్రదం చేద్దాం

విశాలాంధ్ర-కదిరి : నేటి నుండి జనవరి 19 వరకు ఏపిఎస్ ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలను జయప్రదం చెయ్యాలని డిపో మేనేజర్ బి.మైనోద్దీన్ తెలిపారు. డిపో సిబ్బంది సమిష్టిగా పని చేయాలని, డోర్ డెలివరీలను అత్యధిక స్థాయిలో బుక్ చేయుటకు సహకరించి, ప్రయాణికులకు డోర్ డెలివరీ చేసి వారిలో సంతోషాన్ని నింపాలని డిపో గ్యారేజి వద్ద గేట్ మీటింగ్ ద్వారా డిపో మేనేజరు ఉద్యోగులకు తెలిపారు. రానున్న క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగను కార్గో డోర్ డెలివరీ ద్వార బహుమతులు, గ్రీటింగ్‌లను కార్గో సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ట్రాఫిక్ ఇన్-చార్జి పెద్దన్న, కార్గో సూపర్‌వైజర్, ఈ.శ్రీనివాసులు, డిపో సిబ్బంది ఉద్యోగులు పాల్గొన్నారు.

పెనుకొండ కోటపై వైసీపీ జెండా ఎగురవేస్తాం

విశాలాంధ్ర-సోమందేపల్లి: పెనుకొండ కోటపై వైసీపీ జెండా ఎగరవేస్తామని ఉషశ్రీ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక వైయస్సార్ సర్కిల్లో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలను పెనుకొండ నియోజకవర్గం నాయకులు, కార్యకర్త మధ్యన ఘనంగా నిర్వహించారు. ముందుగా వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు, అనంతరం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి సుమారు 30 కేజీల కేకును కట్ చేసి కార్యకర్తలకు నాయకులకు పంచారు. కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలు త్వరలో నిర్వహిస్తే వైసిపి పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందని, గ్రామ గ్రామాలలోన గ్రామ కమిటీలు ఏర్పాటు చేసుకొని వైసిపిని బలోపేతం చేయాలని నాయకులకు కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో వైసీపీ కన్వీనర్ గజేంద్ర, సత్య సాయి జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు రమాకాంత్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు గోవిందమ్మ గారి శ్రీనివాసులు, జడ్పిటిసి డిసి అశోక్, పాల్గొన్నారు.

చిరుత దాడిలో గేద దూడ మృతి

విశాలాంధ్ర-గుడిబండ: మండలంలోని మద్దనకుంట గ్రామానికి చెందిన తిమ్మప్పకు చెందిన గేద దూడపై గురువారం రాత్రి చిరుత దాడి చేయడంతో దూడ మృతి చెందింది. గతంలో కూడా ఇలాంటి ఘటనలు అనేకం జరిగినా కూడా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని మండల ప్రజలు ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా మండలంలోని పలు గ్రామాలలో మేకలు, గొర్రెలు, పశువులు గేదె తదితర మూగజీవులపై చిరుత దాడులు చేస్తూ భయం కల్గిస్తోందని, అటవీశాఖ అధికారులు గ్రామస్థాయిలో పర్యటించి చిరుతను బంధించి మూగజీవాలను సంరక్షించి రైతులు ఆర్థికంగా నష్టపోకుండా చూడాలని కోరారు

అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు ఆక్షేపనీయం

విశాలాంధ్ర-పుట్టపర్తి: రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ పై కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమని పుట్టపర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇనచార్జి దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీజేపీ.. కాంగ్రెస్‌ని దెబ్బ తీయాలంటే రాజకీయంగా ఎదుర్కోవాలని అంబేద్కర్ ని అవమానించడం ద్వారా అది ఎప్పటికీ సాధ్యం కాదన్నారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని కనుమరుగు చేయడమే బిజెపి లక్ష్యం అని అన్నారు.. అంబేద్కర్ పేరు ఉచ్చరించడానికి దేశంలో ప్రతి పౌరుడికి హక్కు ఉందన్నారు.. అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ గౌరవిస్తోందని, తామెప్పుడు రాజకీయాల కోసం రాజ్యాంగ నిర్మాతని వాడుకుంది లేదన్నారు.. ఉద్దేశపూర్వకంగానే దళితుల్ని అవమానించే రీతిలో ఆయన చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.. ప్రజాక్షేత్రంలో త్వరలో బిజెపికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన అన్నారు..

రైతు సేవా సిబ్బంది సామర్థ్యం పెంపుపై శిక్షణ

విశాలాంధ్ర-చిలమత్తూరు: హిందూపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల రైతు సేవా కేంద్ర సిబ్బందికి మండల కేంద్రంలోని ఆర్బీకే కేంద్రంలో శుక్రవారం సామర్థ్యం పెంపుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ పంటలలో సమగ్ర ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం, పంటలలో చీడపీడల నివారణ చర్యలు, ఎన్.పి.ఎస్.ఎస్, సి. యల్ .యస్ యాప్ గురించి రామసుబ్బయ్య డాట్ సెంటర్ పుట్టపర్తి వివరించారు. సూక్ష్మనీటిపారుదల (ఏపీఎంఐపి) సుదర్శన్ మాట్లాడుతూ స్ప్రింక్లర్ల పరికరాలు 30 వేల హెక్టార్లు సత్యసాయి జిల్లాకు మంజూరయ్యాయని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యాన అధికారి శ్రీ మహేష్ నాయక్ మాట్లాడుతూ మామిడిలో పూతకు యాజమాన్య పద్ధతులను వివిధ పథకాలు వివరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు,హిందూపురం డివిసన్ అల్తాఫ్ అలీఖాన్, సిరికల్చర్ అధికారి రమణ రెడ్డి, జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడిఏ సనావుల్లా, డివిజన్‌లోని మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

బలిజపల్లి బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

విశాలాంధ్ర-నంబులపూలకుంట: కదిరి నుండి నంబులపూలకుంట మీదుగా బలిజపల్లి గ్రామానికి బస్సు సర్వీసు పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. బలిజపల్లి, పెదబల్లి,పాపన్నగారిపల్లి,కొత్తపల్లి, దిగువతుపల్లి గ్రామాల నుండి దాదాపు అరవై మంది విద్యార్థులు ఎన్‌పి కుంటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వస్తున్నారు. ఇంతకు మునుపు ఉదయం,సాయంత్రం వేళల్లో నిత్యం ఆర్టీసీ బస్సు నడిపేవారు.. కొన్ని నెలల నుండి ఉదయం మాత్రమే బస్సు నడుస్తోందని,సాయంత్రం వేళల్లో రావడం లేదని పలువురు తల్లిదండ్రులు తెలిపారు. సాయంత్రం పాఠశాల నుండి వారి గ్రామాలకు చేరుకోవాలంటే ఆటోలు, ఇతర వాహనాల మీద ఆధార పడాల్సివస్తోందని, కదిరి ఆర్టీసీ డిపో మేనేజర్ స్పందించి బలిజ పల్లి వరకు బస్సు సర్వీసును తిరిగి పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించండి...

విశాలాంధ్ర-అగళి : పరిసరాల పరిశుభ్రతను పాటించి సీజన్ వ్యాధులు మలేరియా, డెంగీ, చికున్ గున్యా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డాక్టర్ గాయత్రి మడకశిర మలేరియా సబ్ యూనిట్ అధికారి షమివుల్లా సూచించారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఆశ వర్కర్లకు ఏఎన్ఎంలకు ఫ్రైడే డ్రై డే కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ నీరు నిల్వ ఉండకుండా వారానికి ఒకసారి శుభ్రపరచుకుంటే దోమలు లార్వాలను అరికట్టవచ్చన్నారు. డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ "జికా" వైరస్ వ్యాధి ఎడిస్ దోమ వలన వ్యాప్తి చెందుతుందని, ప్రజలు జాగ్రత్త వహించాలని సూచించారు, ఈ కార్యక్రమంలో పీహెచ్ఎం లక్ష్మీదేవి సూపర్వైజర్ నర్సారెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు ఎమ్మెల్ హెచ్‌పిలు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు,

22న హాకీ జట్ల ఎంపిక పోటీలు ...

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 22వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు శ్రీ సత్యసాయి జిల్లా సబ్ జూనియర్, జూనియర్ బాలుర హాకీ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఏపీ హాకీ ఉపాధ్యక్షులు, హాకీ శ్రీ సత్య సాయి జిల్లా అసోసియేషన్ కార్యదర్శి బి. సూర్యప్రకాష్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ క్రీడా మైదానంలో ఎంపికైన సబ్ జూనియర్ బాలుర జట్టు హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జనవరి 17వ తేదీ నుండి 20వ తేదీ వరకు మదనపల్లిలో జరుగు సబ్ జూనియర్ హాకీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జూనియర్ పోటీల వేదిక త్వరలో ప్రకటిస్తామని ఈ ఎంపిక పోటీలలో పాల్గొనుబోవు సబ్ జూనియర్ క్రీడాకారులు01-01-2009తర్వాత జన్మించి ఉండాలని, జూనియర్ క్రీడాకారులు 01-01-2006 తర్వాత జన్మించి ఉండాలని, క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు బర్త్ సర్టిఫికెట్ వెంట తీసుకొని రావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ఆసక్తిగల హాకీ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కార్గో డోర్ డెలివరీని మరింత అభివృద్ధి పరచండి..

విశాలాంధ్ర-ధర్మవరం: ఆర్టీసీ బస్సులలో కార్గో డోర్ డెలివరీని మరింత అభివృద్ధి పరచాలని డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక డిపో ఆవరణలో డెలివరీ ప్రచార మాసోత్సవాన్ని వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కార్గో వ్యవస్థ వ్యాపారుల వద్ద, ప్రజల వద్ద మంచి గుర్తింపు పొందిందన్నారు. కార్గో ద్వారా ఒక కేజీ బరువు నుండి 50 కేజీల వరకు (జిఎస్టి అదనం) డోర్ డెలివరీని నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులందరూ కూడా ఒక్కొక్కరు మూడు డెలివరీనీ కార్గొ ద్వారా ద్వారా చేయించి కార్గో అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. ఆర్టీసీ సంస్థకు పరోక్షంగా కార్గో వ్యవస్థ ఎంతో సహకరిస్తుందని తెలిపారు. ఈ డోర్ డెలివరీ వ్యవస్థను మనతోపాటు మన కుటుంబీకులు, స్నేహితులు, బంధువులు, భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్గో డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవాలు ఈనెల 20వ తేదీ నుండి జనవరి 19వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. డోర్ డెలివరీ సౌకర్యం ఆంధ్రప్రదేశ్లో 80 ప్రాంతాలలో కలదని తెలిపారు. 50 కేజీల బరువు వరకు పది కిలోమీటర్ల పరిధిలో డోర్ డెలివరీ సదుపాయం కలదని తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతోపాటు కార్యాలయ సిబ్బంది తాము బస్సు ఎక్కి సర్వీస్ చేసేటప్పుడు దిగి పోయే ప్రయాణికులకు డోర్ డెలివరీసౌకర్యం గురించి తెలిపి ప్రోత్సహించాలని తెలిపారు. మన ధర్మవరం డిపోకు ఇచ్చిన టార్గెట్‌ను అందరూ సహాయ సహకారాలు అందించి సంస్థను అభివృద్ధి బాటలో నడపాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది శ్రీరాములు, రామ్మోహన్ రెడ్డి, డిపో మెకానికులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శనివారం 21, డిసెంబర్ 2024

వాహనాలను తనిఖీలు చేపట్టాలి

మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.. శివ్ నారాయణ్ శర్మ జిల్లా కలెక్టర్ (ఎఫ్.ఏ.సి)

విశాలాంధ్ర-అనంతపురం: వైజాగ్ వైపు నుండి వచ్చే రైళ్లను, బస్సులను, ప్రైవేటు వాహనాలను తరచూ తనిఖీలు చేపట్టాలని, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై పాఠశాలల్లో, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు పెద్ద సంఖ్యలో చేపట్టాలని శివ్ నారాయణ్ శర్మ, జిల్లా కలెక్టర్ (ఎఫ్.ఏ.సి) ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎన్కొఆర్డీ (నార్కో కోఆర్డినేషన్ సెంటర్) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని అడిషనల్ ఎస్పీ డి.వి.రమణమూర్తితో కలిసి శివ్ నారాయణ్ శర్మ, జిల్లా కలెక్టర్ (ఎఫ్.ఏ.సి) నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ (ఎఫ్.ఏ.సి) మాట్లాడుతూ... వైజాగ్ వైపు నుండి వచ్చే రైళ్లను, బస్సులను, ప్రైవేటు వాహనాలను తరచూ తనిఖీలు చేపట్టాలని, జిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు ఉపయోగించకుండా గట్టి నిఘా చర్యలు తీసుకోవాలని, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు ఉపయోగించకుండా ప్రతి పాఠశాల, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు)ఎక్కువ సంఖ్యలో నిర్వహించాలన్నారు. అలాగే పాలిటెక్నిక్ కళాశాలలో పిల్లల తల్లిదండ్రులు, ఇతర శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు పోలీస్ శాఖ వారితో కలిసి సమన్వయంతో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని, పంటల సాగు నందు గంజాయి సాగు చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులకు సూచించారు. అనంతపురంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పూర్తి స్థాయి డి-అడిక్షన్ వార్డుకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ డి.వి.రమణమూర్తి మాట్లాడుతూ.. గత సమావేశం తర్వాత నవంబర్ 16 నుండి డిసెంబర్ 19 వరకు ఒక కేసు నమోదయిందని, నలుగురు నిందితులలో ముగ్గురిని రిమాండ్ కు పంపామని వారి నుండి 1.521 కేజీ గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ముమ్మరంగా జరుపుతున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్ఓ ఏ.మాలోల, అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వరరావు, హార్టికల్చర్ డిడి నరసింహారావు, ఐసిడిఎస్ పీడీ వనజా అక్కమ్మ, డిటిసి వీర్రాజు, సాంఘిక సంక్షేమ శాఖ జెడి ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం సుమంత్, డిటిడబ్ల్యూఓ రామాంజనేయులు, డిఈఓ ప్రసాద్ బాబు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇన్చార్జి డిడి సుభాషిని, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రైల్వే, అటవీ శాఖ, ఇంటర్మీడియట్ బోర్డ్, వైద్య ఆరోగ్యశాఖ, పాలిటెక్నిక్, జేఎన్టీయూ అధికారులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర-కూడేరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ని సభలో కించపరిచిన అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలనిదళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధన కార్యదర్శి జె.మల్లి కర్జున డిమాండ్ చేశారు. శుక్రవారం దళిత నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరును పార్లమెంటులో భారత రాజ్యాంగం ప్రకారం ప్రజల చేత ఎన్నుకోబడిన గౌరవ పార్లమెంటు సభ్యులు పార్లమెంట్ భవనం సమావేశంలో గౌరవ సభ్యులు అంబేద్కర్ పేరును ఎందుకు ఉచ్చరిస్తారు అంబేద్కర్ బదులుగా దేవుని స్మరిస్తే పుణ్యం కలుగుతుందని వ్యంగ్యంగా మాట్లాడడం చూస్తే కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి మోడీ ప్రభుత్వ నిజస్వరూపం బయటపడిందని తెలిసింది భారతదేశ వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని రచించిన భారత రాజ్యాంగం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఐక్యరాజ్యసమితిలో ప్రతిష్టించారు అలాంటి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను దుర్మార్గపు చర్యగా భావిస్తున్నాము సంబంధించిన అధికారులు చర్యలు తీసుకోవాలని అలాగే అమిత్ షా దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పి తీరాలని పీహెచ్పీఎస్ దళిత కుల పోరాట సమితి ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రామాంజనేయులు. వీరా. రమణ .విహెచ్పిఎస్ నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత వైద్య చికిత్స శిబిరమును సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని తొగటవీధిలోగల శ్రీ శాంత కళా చౌడేశ్వరి ఆలయ ఆవరణములో ఈ నెల 22వ తేదీ ఆదివారం శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో 106వ ఉచిత వైద్య చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి సంఘం నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 10 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ శిబిరమును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉచిత వైద్య పరీక్షలతో పాటు ఉచిత మందులు కూడా పంపిణీ చేయబడునని తెలిపారు. శిబిర దాతగా కీర్తిశేషులు బద్దెల బాలమ్మ, కీర్తిశేషులు బద్దెల వెంకటరామయ్య, కీర్తిశేషులు బద్దెల వరలక్ష్మి, కీర్తిశేషులు బద్దెల వెంకటరత్నయ్య జ్ఞాపకార్థం వీరి కుమారులు బివి. శ్రీనివాసులు అండ్ బ్రదర్స్ వారు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ వైద్యులు వివేక్ కుల్లాయప్ప, వెంకటేశ్వర్లు, సాయి స్వరూప్, సతీష్ కుమార్, జై దీపు నేత లచే వైద్య చికిత్సలతో పాటు ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను కూడా వివరించడం జరుగుతుందని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని పట్టణము, గ్రామీణ ప్రాంతాలలోని పేద ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యమును కాపాడుకోవాలని తెలిపారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎంఈవో

విశాలాంధ్ర-రొళ్ల: మండల పరిధిలోని అవినకుంట గ్రామంలో కస్తూరిబా గాంధీ పాఠశాలలో మరియు ఎం.రాయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎస్ఏ-1 పరీక్ష కేంద్రాలను మండల విద్యాశాఖ అధికారి ఎన్.శ్రీధర్ శుక్రవారం పరిశీలించారు.అదేవిదంగా ఎమ్.ఆర్ గొల్లహట్టి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు జరుగుతున్న ఎస్ఏ-1పరీక్ష కేంద్రాలను వారు సందర్శించి గణిత మోడల్ పేపర్ పరీక్ష నిర్వహణను వారు పరిశీలించి సిబ్బందికి సూచనలు సలహాలు అందజేశారు. అనంతరం విద్యార్థుల హాజరు ఉపాధ్యాయుల హాజరు లెసన్ ప్లాన్,సమ్మేటివ్ జవాబు పత్రాలు విద్యార్థుల ప్రగతి,హెలిస్టిక్ కార్డులు వర్క్ బుక్ కార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కస్తూరిబా గాంధీ ప్రిన్సిపల్ మునివర్జన్,పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లినమడుగు గ్రామంలో రెవిన్యూ సదస్సు

విశాలాంధ్ర-రొళ్ల :మండల పరిధిలోని మల్లినమడుగు గ్రామంలో శుక్రవారం తహశీల్దార్ పేక్షావలి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు గ్రామాల నెలకొన్న సమస్యలను తీర్చడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలియజేశారు.ఈ సందర్భంగా అధికారులు రైతుల నుండి వచ్చిన 1బి పాస్ పుస్తకం అడంగల్‌లో ఉన్న సమస్యలను అర్జీ రూపంలో స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ అర్జీ రూపంలో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిశీలించి 45 రోజుల్లో పరిష్కరించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రేషన్ కార్డులు,ఇల్లు,పింఛన్ కోసం అందించిన దరఖాస్తులను ఆయాశాఖ సంబంధించి అధికారులకు అందజేసి పరిష్కరిస్తామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శివ నారాయణ రెడ్డి,తెదేపా టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర కార్యదర్శి బి.ఎస్ గురుమూర్తి,మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గిరియప్ప,వీఆర్వోలు రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభల ద్వారా సమస్యలు పరిష్కారం

విశాలాంధ్ర-చిలమత్తూర్: మండల పరిధిలోని వీరాపురం పంచాయతీ గ్రామంలో శుక్రవారం ఆర్డీవో ఆనంద్ కుమార్ అధ్యక్షతన గ్రామాలలో నెలకొన్న సమస్యలను గ్రామ సభలు ద్వారానే పరిష్కారం చేసుకోవచ్చని, అందుకోసం ప్రభుత్వం 49 రకాల వినుతలను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా గ్రామసభలను ప్రవేశపెట్టిందని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు రెవిన్యూ సమస్యలు, ఇతర సమస్యలను కూడా సభలలో పాల్గొని ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే పరిష్కరించుకోవచ్చని, పరిష్కారానికి గ్రామసభ ఒక వేదిక అని, దీన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, మాజీ సర్పంచ్ అంజనమ్మ, శంకర్ రెడ్డి, భయపరెడ్డి, అశ్వత్ రెడ్డి, తదితరులు నాయకులు కార్యకర్తలు, రెవిన్యూ అధికారి నేలకోటప్ప, సర్వేయర్ కోదండపాణి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు తప్పక పాటించాలి

విశాలాంధ్ర-బుక్కరాయసముద్రం: వాహనదారులు రోడ్డు నిబంధనలను తప్పకుండా పాటించాలని సిఐ కౌలుట్లయ్య సూచించారు. సోమవారం మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మద్యం సేవించి సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. కారు నడిపే వారు సీటు బెల్టును తప్పకుండా ధరించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాల తనిఖీ లో రికార్డులు లేని వాహనాలకు అపరాధ రుసుము విధించారు. ఈ తనిఖీ లో ఎస్సైలు శేషగిరిరావు, గౌస్ మొహిద్దిన్ భాష సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల ప్రక్షాళనకే రెవిన్యూ సదస్సులు

విశాలాంధ్ర-ఉరవకొండ : రికార్డుల ప్రక్షాళనకే రెవిన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తుందని ఉరవకొండ డిప్యూటీ తహసీల్దార్ భోగన్న గౌడ్ తెలిపారు. శుక్రవారం రాయంపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసిల్దార్ మాట్లాడుతూ గ్రామంలో రీసర్వేతో భూము ల కొలతలు తారుమారు కావడం, ఆన్ లైన్ లో భూములు ఎక్కువ, తక్కువ నమోదు కావడం వంటి సమస్యలు ఉంటే అర్జీలు ఇవ్వాలని గ్రామస్థులకు సూచించారు. అనంతరం ముటేషన్, చుక్కల భూములు, పేర్లు మార్పులు, చేర్పులపై అధికారు లకు రైతులు దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అనంతపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగ రాజు, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

నారాయణ సేవలో గర్భిణీలకు అన్నదానం

విశాలాంధ్ర-పెనుకొండ: వివిధ గ్రామాల నుండి వచ్చినటువంటి గర్భిణీ స్త్రీలకు వారు సహాయకులకు మరియు అనారోగ్యముతో హాస్పిటల్కు వచ్చినటువంటి వారికి ఆరోగ్య కార్యకర్తలకు నారాయణ సేవలో భాగంగా సుమారు 150 మందికీ అన్నదానం,వాటర్ పాకెట్లు అందజేసినారు. ఈ కార్యక్రమానికి పెనుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల యందు పనిచేయుచున్న లెక్చరర్ జయప్ప,వీరి భార్య నివేదిత సహకరించి సేవలో పాల్గొని సేవలు అందించినారు,వీరికి వీరి యొక్క చిరంజీవి విఖ్యాత నందన్‌కు,అందరికీ భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి యొక్క అనుగ్రహ ఆశీస్సులు కలిగి ఉండాలని కోరుకుంటున్నామని. సత్య సాయి సేవా సమితి తాలూకా అధ్యక్షులు శంకర్ తెలిపారు.

టూవీలర్ల సైలెన్సర్లు ధ్వంసం

విశాలాంధ్ర-అనంతపురం:అనంతపురంలో టూవీలర్లకు సైలెన్సర్లు బిగించుకుని భారీ శబ్దాలు చేసుకుంటూ తిరుగుతున్న వారిపై జిల్లా ఎస్పీ పి.జగదీష్ కొరడా ఝుళిపించారు. నగర పోలీసులు స్వాధీనం చేసుకున్న 110 టూవీలర్ల సైలెన్సర్లను స్థానిక క్లాక్ టవర్ సమీపంలో ఎస్పీ రోడ్డు రోలర్ తో తొక్కించి ధ్వంసం చేయించారు. మోటారు వాహనాల చట్టం నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలకు కంపెనీ సైలెన్సర్లు కాకుండా వాటి స్థానంలో భారీ శబ్దం వచ్చే సైలెన్సర్లు బిగించుకుని రోడ్లపైకి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు అసౌకర్యానికి గురి కావడమే కాకుండా శబ్ద కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ఒక్కోసారి సాటి వాహన చోదకులు ఏకాగ్రత లోపించి ప్రమాదాలకు గురయ్యే అవకాశముందన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని టూవీలర్లకు సైలెన్సర్లు బిగించుకుని భారీ శబ్దాలు చేసుకుంటూ తిరుగుతున్న వారిపై చర్యలు తీసుకునేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టడం జరిగిందన్నారు. ఈనేపథ్యంలో కంపెనీ ఇచ్చే సైలెన్సర్లను మాత్రమే ఉపయోగించాలని వాహనదారులకు సూచించారు. అధిక శబ్దాలు వచ్చే సైలెన్సర్ల వల్ల ప్రజారోగ్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను ఎలాంటి మార్పు చేసినా.. వాహనదారుడితో పాటు మార్పు చేసిన మెకానిక్?లపై క్రిమినల్? చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. బైక్ యజమానికి 3 నెలల జైలు,రూ.10వేల వరకు జరిమానాతో పాటు 3 నెలలపాటు లైసెన్స్ రద్దుచేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో అనంతపురం డీఎస్పీ వి.శ్రీనివాసరావు, సి.ఐలు,తదితరులు పాల్గొన్నారు.

మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అన్ని విధాలుగా ఆయువుపట్టుగా వున్నా మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని వైద్య ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాకెట్ల పీ.హెచ్.సీ ఆవరణలో 'వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్లు కావాలి.. పీ.హెచ్.సీ లకు రావాలి!' నినాదంతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కోవిడ్ వంటి ప్రళయంలో ప్రాణాలకు తెగించి సేవలు చేయండం లోనూ, ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో అంటువ్యాధులు ప్రభలకుండా తక్షణ సేవల్లోను,అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులోనూ హెల్త్ అసిస్టెంట్ల పాత్ర ప్రధానమైందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసమే కాకుండా అందరికీ ఆరోగ్యాన్ని అందించే ప్రాథమిక వైద్యాలయాల్లో అన్ని విధాల సహాయకులుగా హెల్త్ అసిస్టెంట్లు కీలక భూమిక పోషిస్తున్నారన్నారని గ్రామీణ స్థాయిలో ఆరోగ్యరంగానికి మూల స్థంభాలైన హెల్త్ అసిస్టెంట్లను కోర్టు ఆదేశాల సాకుతో ఒక్కసారిగా గొంతు కోసి ఉన్నపళంగా ఉద్యోగాల నుంచి పీకేసి నట్టేట ముంచేయడం తీవ్ర అన్యాయమన్నారు. ఇరవై రెండేళ్ల పాటు సుదీర్ఘ సర్వీస్ చేసి 50 ఏళ్ళ దాటిన వయస్సు లో ఉద్యోగం నుంచి బయటకు గెంటెస్తే ఆ ఉద్యోగులపై ఆధారపడ్డ కుటుంబాలు బ్రతికేదెలా.. ఆత్మహత్యలు తప్ప వేరే మార్గం లేదని ప్రభుత్వం తక్షణమే తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు పీ.హెచ్.సి ల నుంచి మెయిల్ ద్వారా సమాచారం పంపించారు. కార్యక్రమంలో పిహెచ్సి దాక్టర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాల పోస్టర్లు విడుదల

విశాలాంధ్ర-గుత్తి: పట్టణంలో పత్తికొండ రోడ్డు వద్ద గల శ్రీ సునామ జకిని మాత ఆలయంలో శుక్రవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆలూరు లక్ష్మణ రావు, ఆలయ ధర్మకర్త సురేష్ రావు ఆధ్వర్యంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం 2025వ సంవత్సరం ఫిబ్రవరి 6,7 న జరిగే జాతర ఉత్సవాల ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు మల్కారి ఆలూరు లక్ష్మణరావు మాట్లాడుతూ ఆరె కటికుల ఆరాధ్య దైవం శ్రీ సునామ జకిని మాత, శ్రీ మల్కుమ జకినీ అమ్మవార్ల 22వ వార్షికోత్సవ జాతర ఉత్సవాలు ఫిబ్రవరి 6,7వ తేదీలలో నేత్రపర్వంగా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్,సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ,ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్,గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం,ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ గుత్తి మండల ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని, అదేవిధంగా సమస్త భక్తాదులందరూ ఈ పరమ పవిత్ర కార్యక్రమానికి తప్పక విచ్చేసి శ్రీ అమ్మవార్ల ను దర్శించి వారి కృపకు పాత్రులు కావాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు మల్కారి ఆలూరు లక్ష్మణరావు, ఆలయ ధర్మకర్త కె సురేష్ రావు,కార్యనిర్వాహక అధ్యక్షులు ఎంకే.సాయినాథ్, మహిళా అధ్యక్షురాలు ఏ.సరస్వతి బాయి,ప్రధాన కార్యదర్శి ధర్మకారి భాస్కర్ రావు, కోశాధికారి సుధాకర్ రావు,ఉప కోశాధికారి ఎంకే బాబురావు,యువ ఆరె కటికులు అమరనాథ్, భాగ్య రాజు,మక్తేష్, సుభాష్, అభి,శ్రీనివాసులు,కిషోర్,సుదర్శన్,అనిల్,సుధాకర్,సత్య,విశ్వ నాథ్,సునీల్ మాధవ్, మల్లికార్జున,లక్ష్మి కాంత్,అరుణ్ రాన, సందీప్, అరె కటిక కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మైలా నాట్యా కళాక్షేత్రం ప్రారంభోత్సవం

విశాలాంధ్ర-శెట్టూరు : కళ్యాణ్ దుర్గం ఆర్డిటి హాస్పిటల్ సమీపంలో మైలా నాట్యా కళాక్షేత్రం శుక్రవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి జబర్దస్త్ యాంకర్ శాంత కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని పూజా కార్యక్రమం నిర్వహించి కళాక్షేత్రాన్ని ప్రారంభించారు. అనంతరం జబర్దస్త్ యాంకర్ శాంత్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి కళాక్షేత్ర ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. మైలా నాట్య కళాక్షేత్రంలో శాస్త్రీయ, నృత్యాలు, కూచిపూడి, భరత నాట్యం, జానపద సినిమా కోలాటం అదేవిధంగా సంగీత టీచర్ అశ్విని శాస్త్రీయ కర్ణాటక సంగీతం గాత్రం భక్తి గీతాలు జానపద గీతాలు నేర్పబడును వారు తెలియజేశారు. ఆర్డిటి స్వచ్ఛంద సంస్థ ద్వారా తిరుపతి ఎస్వి మ్యూజిక్ కాలేజ్ అండ్ డాన్స్ కాలేజ్ కూచిపూడి భరతనాట్యం డిప్లమో పూర్తి చేయడానికి అవకా శం కల్పించిన ఆర్డిటి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ కౌన్సిల్ సభ్యులు మహదేవ్, ఎమ్మెస్ రాయుడు, డాన్స్ మాస్టర్ మైలా, మోహన్, నాగేంద్ర, రమేష్,రాజేష్,తిప్పేస్వామి పాల్గొన్నారు.

నవవధువులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-తాడిపత్రి : మండలంలోని రావి వెంకటం పల్లి గ్రామంలో ఉన్న ఆంధ్ర నాంచారమ్మ కళ్యాణ మండపంలో శుక్రవారం ఎర్రగుంటపల్లి గ్రామ సర్పంచ్, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ యుగంధర్ కుమారుడి వివాహ శుభకార్యమునకు ఎమ్మెల్యే జెసి. అస్మిత్ రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే జెసి. అస్మిత్ రెడ్డిని పురోహితుడు మంత్రోచ్ఛారణతో భాజా, భజంత్రీలు, మేళ, తాళాలతో సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే జెసి. అస్మిత్ రెడ్డి నవ వధువులను తలంబ్రాలు వేసి నిండు నూరేళ్లు, పిల్లాపాపలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. అనంతరం నవ వధువులకు పెళ్లి కానుకగా దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, జెసి అభిమానులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రామ రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధిలోని వేములపాడు గ్రామంలో శుక్రవారం తహసిల్దార్ ప్రతాపరెడ్డి గ్రామంలో గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ రెవిన్యూ సదస్సులో అధికారులు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు, రైతులకు ఉన్నటువంటి భూ సమస్యల పరిష్కారం కొరకు గ్రామ పరిధిలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించే దిశగా ఈ రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు తహసిల్దార్ ప్రతాప్ రెడ్డి తెలిపారు. వేములపాడు రెవెన్యూ సదస్సులో రైతులు వివిధ భూ సమస్యలపై 14 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాసులు వేములపాడు సర్పంచ్ ఓంకారమ్మ ,ఆర్ .ఐ. కిష్టప్ప, రెవిన్యూ సిబ్బంది,సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గుంతకల్లు : మండల పరిధిలో అయ్యవారిపల్లి గ్రామ వాస్తవ్యులు తెదేపా నేత మేడిపల్లి శ్రీనివాస్ రెడ్డి కుమారుడు వివాహ మహోత్సవ కార్యక్రమానికి గుంతకల్లు మాజీ శాసనసభ్యులు,తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. జితేంద్ర గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం టీడీపీ శ్రేణులతో కలిసి కోగటం ఫంక్షన్ హాల్ లో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి,శుభాకాంక్షలు తెలియజేశారు..ఈ కార్యక్రమం లో క్లస్టర్ ఇంచార్జ్ ఎంహెచ్ లక్ష్మీనారాయణ రెడ్డి, పట్టణ కన్వీనర్ జింకల రామకృష్ణ,గుత్తి మండలం మాజీ ఎంపీపీ వీరభద్రయ్య, రంగా,మస్తాన్,గాదిలింగ గౌడ్ గుంతకల్లు మండలం పామిడి పట్టణం టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు ల్యాబ్‌లను అకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధిలోని రాయల చెరువు,చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం మలేరియా జోనల్ ఆఫీసర్ లక్ష్మణ్ సందర్శించి రికార్డులు ల్యాబ్ లను ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో తీసిన ప్రతి రక్త పూత ల్యాబ్ లో పరీక్ష చేయాలని అన్నారు. ప్రతీ రోజు డెంగీ, మలేరియా కిట్ల ద్వారా పరీక్షలు చేయాలని తెలియజేశారు. రాయల చెరువు సచివాలయం వన్‌లో డ్రై డే కార్యక్రమం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చుక్కలూరు మెడికల్ ఆఫీసర్ లావణ్య, వైద్యులు అప్పయ్య, దేవానంద్, ఎంపీ హెచ్ ఈవో నిత్య పూజ్య,సబ్ యూనిట్ ఆఫీసర్లు చిగురుపాటి శ్రీనివాసులు, రామకృష్ణ, సూపర్ వైజర్ నారాయణ,షబ్బీర్ తదితర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి గోల్డ్ మెడల్

విశాలాంధ్ర-తాడిపత్రి: విజయవాడలోని తాజ్ వివంత్ హెూటల్‌లో శుక్రవారం రాష్ట్రస్థాయి మున్సిపాలిటీలలో త్రాగునీరు పంపిణీ, వీధిదీపాలకు విద్యుత్ వినియోగం ఏ మున్సిపాలిటీ విద్యుత్ ఆదా చేసింది అనే దానిపై కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ ఐఏఎస్, మిషన్ బిఏవిపి కుమార్ రెడ్డి ఏపీ జెన్కో ఎండి కె.చక్రధర్ బాబు ఐఏఎస్, ఏపీసిపిడిసిఎల్ సిఎండి పత శెట్టి ఐఏఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిపత్రి మున్సిపాలిటీ మాదిరిగా ప్రతి మున్సిపాలిటీ కృషి చేస్తే రాష్ట్రంలో విద్యుత్ ఆదా ఎంత అవుతుందని చెప్పారు. అనంతరం అవార్డులు పంపిణీలో విద్యుత్ ఆదా చేయడంలో తాడిపత్రి మున్సిపాలిటీ గోల్డ్ మెడల్ అవార్డును మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ అందుకున్నారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ ఈ అవార్డు అందుకోవడానికి సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే జేసీ.అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసి.ప్రభాకర్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. అలాగే మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బందికి, పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర-ఉరవకొండ: పట్టణంలో బూత్ నెంబర్ 136 భద్రప్ప బావి వద్ద ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు అయిన నిధులతో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణానికి టిడిపి పార్టీ నాయకులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆయన సోదరుడు శ్రీనివాసులు సహాయ సహకారాలతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. బూత్ కన్వీనరు నిమ్మలప్రసాద్,మాజీ వైస్ ఎంపీపీ పెద్దకోట్ల రాజేష్ దోనపర్తి ప్రతాప్ శంకర్ సుదర్శన్, బెస్త రమేష్ తదితరులు పాల్గొన్నారు.

31వరకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గడువు పెంపు

విశాలాంధ్ర-ఉరవకొండ: ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమాయోజన గడువును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 31 వరకు పొడిగించారని దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉరవకొండ మండల వ్యవసాయ అధికారి శుభకర తెలిపారు. శుక్రవారం ఉరవకొండ పట్టణ పరిసర ప్రాంతాల్లో పప్పు శనగ సాగుచేసిన పొలాలను ఆయన సందర్శించారు.ఆయన మాట్లాడుతూ పప్పు సెనగ జొన్న, మామిడి,టమాటో సాగుచేసిన రైతులు స్థానిక రైతు సేవ కేంద్ర సిబ్బందిని సంప్రదించి పంట ధ్రువీకరణ పత్రాన్ని తీసుకువెళ్లి మీ దగ్గరలోని మీ సేవలో గాని కామన్ సర్వీస్ సెంటర్లో గానీ ప్రీమియంను చెల్లించాలని తెలి పారు. అనంతరం ఆయన పంటలకు వచ్చే చీడపీడ నివారణకు సంబం ధించి రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు.కార్యక్రమంలో సెరికల్చర్ అసిస్టెంట్ లక్ష్మీదేవి రైతులు రఘునాథ్,రామన్న నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వరిపంట సాగుపై అవగాహన

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: బొమ్మనహాళ్ మండలపరిధిలోని శ్రీధరఘట్ట చెరువు కింద రబీసీజన్లో ఆయకట్టు కింద పంట నీరు ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భూగర్భజలశాఖ అధికారులు రైతులకు అవగాహన సదస్సు కల్పించారు. భూగర్భజల శాఖ అధికారి అప్పలనాయుడు పంట నీరు ప్రణాళికపై సలహాలు, సూచనలు ఇచ్చారు. తక్కువ నీటితో తక్కువ కాలంలో పంటలు చేతికొచ్చే వాటిని సాగు చేసుకోవాలని వేసవిలో పంటలు దిగుబడి రావాలంటే ఇబ్బందికరంగా ఉంటుందని తెలిపారు. రైతులు రబీసీజన్లో లో ఇబ్బందులకు గురికాకుండా వ్యవసాయాధికారులు సూచనల మేరకు పంటలు సాగుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, చెరువు సంఘం అధ్యక్షులు కృష్ణ, ఉపాధ్యక్షులు వెంకటేశులు, మాజీ ఎంపీటీసీ తిప్పేస్వామి, ఎర్రిస్వామి, లారీ చంద్ర, రైతులు పాల్గొన్నారు.

రైతు దినోత్సవం జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ఉరవకొండ: ఈనెల 23వ తేదీన ఉరవకొండలో ఉరగాద్రి చౌడేశ్వరి కళ్యాణమండపంలో జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చి జయప్రదం చేయాలని జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు తెలిపారు. శుక్రవారం ఉరవకొండ ఆయన విలేకరులతో మాట్లాడుతూ అందరికీ అన్నం పెట్టే రైతుల పండుగ సందర్భంగా 23వ తేదీన స్థానిక అనంతపురం బైపాస్ రోడ్డు నుండి ఉరగాద్రి కళ్యాణ మండపం వరకు అన్నదాత ఆనంద ర్యాలీ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అంతేకాకుండా వ్యవసాయ ఉత్తమ రైతు, ఉత్తమ శాస్త్రవేత్త, ఉత్తమ జర్నలిస్టు తో పాటు వివిధ రంగాలలో సేవ చేస్తున్న వారికి ఉత్తమ అవార్డులను అందిస్తున్నట్లు తెలిపారు. రైతు కుటుంబాల ఆరోగ్యం కోసం కిమ్స్ సవేరా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎల్వీ ప్రసాద్ కంటి వైద్య ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విశ్రాంతి నిరుపేద రైతులకు వస్త్ర దానం వివిధ అంశాలలో పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు కూడా అందిస్తున్నట్లు నాగమల్లి ఓబులేసు తెలిపారు.

టీడీపీ కార్యకర్త తల్లి మృతికి పలువురు సంతాపం

విశాలాంధ్ర-పెనుకొండ:పట్టణంలోని తోటగిరి వీధిలోనుండు టిడిపి కార్యకర్త బలిజ నారాయణస్వామి తల్లి సాకమ్మ 65 సంవత్సరాలు శుక్రవారం స్వర్గస్తురాలైనారు విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీరాములు, పులుగూర శ్రీనివాసులు, రేపటి సుబ్రహ్మణ్యం,అశ్వర్తమ్మ,గోపి ,కొల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.